క్లుప్తంగా

ఐద్వా నాయకురాలు బూరగ సరస్వతి మృతి

తాడేపల్లిరూరల్: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వారా) తాడేపల్లి మండల మాజీ అధ్యక్షురాలు బూరగ సరస్వతి (52) గురువారం రాత్రి మృతి చెందారు. సరస్వతి సీపీఎం తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వర్లు భార్య. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. ఈమె కృష్ణనగర్ పంచాయతీ సభ్యురాలిగాను, కృష్ణనగర్ పైలెట్ ప్రాజెక్టు కమిటీ సభ్యురాలిగా, సీపీఎం తాడేపల్లి పట్ట కమిటీ సభ్యులుగా ఉంటూ పలు ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నారు.

ఎన్నారైలో ఎండోస్కోపీపై వర్క్‌షాప్

మంగళగిరి: నగర పరిధిలోని చినకాకాని ఎన్నారై అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లో జనరల్ సర్జరీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సర్జికల్ స్కిల్ ల్యాబ్ హ్యాండ్స్ ఆన్ అప్పర్ గ్యాస్ట్రో ఇంటెస్టైనల్ ఎండోస్కోపీపై మూడు రోజుల పాటు జరగనున్న వర్క్‌షాప్ శుక్రవారం ప్రారంభమైంది. సీనియర్ వైద్యులు పాల్గొని ఎండోస్కోపీ యొక్క ప్రాముఖ్యతను పీజీ విద్యార్థులకు వివరించారు. గత సంవత్సరం నుంచి ఎన్నారై అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లో మాత్రమే ఈ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఓడీ డాక్టర్ శివ శంకర్ తెలిపారు. డాక్టర్లు సుష్మ, అనురూప్, శ్రీకాంత్, మల్లిఖార్జునరెడ్డి, ప్రసన్నకుమార్, దినకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలను పరిశీలించిన జేడీ డాక్టర్ చంద్రిక

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని కళ్లం వెంకటరెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్ జేడీ డాక్టర్ చంద్రిక శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె 10వ తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. పదవ తరగతిలో ఎస్‌ఏ-1 పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. పాఠశాల హెచ్‌ఎం రాయల సుబ్బారావు, ఉపాధ్యాయులు ప్రసాద్, కోటేశ్వరరావు, నాగేషు, స్వరూప, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా భావనాఋషి కల్యాణం

మంగళగిరి: నగరంలోని పాత మంగళగిరిలో వేంచేసియున్న భద్రావతీ సమేత భావనాఋషి స్వామి వార్ల కల్యాణ మహోత్సవం శుక్రవారం రాత్రి కనుల పండువగా జరిగింది. పాత మంగళగిరి పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కల్యాణ మహోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఉదయం 7గంటలకు స్వామివార్లకు విఘ్నేశ్వరపూజ నిర్వహించారు. ఉదయం 10 గంటలకు స్వామి వారు పెండ్లి కుమారునిగా భక్తులకు దర్శనమిచ్చారు. పలువురు భక్తులు స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

జిల్లా పరిషత్ పాఠశాలలో ఆర్జేడీ తనిఖీలు

మేడికొండూరు: మేడికొండూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌ను శుక్రవారం ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా హైస్కూల్‌లో జరుగుతున్న నాడు-నేడు పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణంలో ఉన్న భవనాలను పరిశీలించారు. అదేవిధంగా మధ్యాహ్న భోజన పథకం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థుల హాజరు పట్టీని పరిశీలించి, పదవతరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై దిశానిర్దేశం చేశారు. ఆన్‌లైన్‌లో జరుగుతున్న ప్రధానమంత్రి పరీక్ష పే పై చర్చాగోష్ఠిని విద్యార్థులకు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.సుధాకర్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి జయరామిరెడ్డి, హైస్కూల్ హెచ్‌ఎం కె.జయప్రద, పలువురు అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫ్యాన్సీ దుకాణం దగ్ధం

రూ.3లక్షల ఆస్తినష్టం

మేడికొండూరు: మండలంలోని సిరిపురం గ్రామంలో శుక్రువారం అగ్నిప్రమాదం జరిగి ఫ్యాన్సీస్టోర్ పూర్తిగా దగ్ధం అయింది. సిరిపురం గ్రామానికి చెందిన షేక్ నూర్‌బాషా ఫ్యాన్సీస్టోర్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున ఒక్కసారిగా షాపులో మంటలు వ్యాపించాయి. షాపులో నుంచి దట్టమైన పొగ వెలువడుతుండటంతో స్థానికులు నూర్‌బాషాకు సమాచారం ఇచ్చారు. గ్రామస్తులు కొందరు నీళ్లతో మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే షాపు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యింది. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. సుమారు రూ.3లక్షల ఆస్తినష్టం వాటిల్లి నట్లు షాపు నిర్వహకుడు తెలిపారు. ఈ సంఘటన పై మేడికొండూరు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.



పౌరని పాచిక.. ఇప్పటి నుంచి అభివృద్ధి వీచిక

- ఇప్పటంలో ప్రతిపక్షాల కుట్రలు, కుతంత్రాలకు సమష్టిగా చెక్‌పెట్టిన గ్రామస్తులు
- గ్రామంలో పేదలకు అందుబాటులోకి వచ్చిన ఫంక్షన్ హాల్
- ప్రత్యేక పెళ్లి మండపం, డైనింగ్ హాల్, వంటశాల
- మహనీయుల పేర్లు ఏర్పాటు
- బహిరంగ ప్రదేశంలో మరో మండపం
- నేడు ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేసిన కార్పొరేషన్ అధికారులు



ఇప్పటంలో పేద ప్రజలకు అందుబాటులోకి రానున్న ఫంక్షన్ హాల్



వీఎం రంగా పేరుతో ఏర్పాటు చేసిన కళావేదిక

తాడేపల్లిరూరల్: ఇప్పటంలో ఎట్టకేలకు రాజకీయాలకు అధికారులు తెరదింపి ప్రజాధనంతో నిర్మించిన ఫంక్షన్ హాల్‌ను అభివృద్ధి చేసి పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు ఈనెల 28వ తేదీన ముహూర్తం ఖరారు చేశారు. ఇప్పటంలో అభివృద్ధి పనులపై జనసేన, టీడీపీలు వక్రీకరిస్తూ రాష్ట్రవ్యాప్తంగా దుష్ప్రచారం చేశారు. స్థానికులు తిప్పి కొట్టడంతో వారి కుళ్లు రాజకీయాలకు తెరపడినట్లయింది. దాంతో అధికారులు ఇప్పటంలో గతంలో ప్రభుత్వ నిధులు, స్థానికుల సహాయ సహకారాలతో ఫంక్షన్ హాల్‌ను నిర్మించారు. కొంతమంది స్వార్థపరులు ఫంక్షన్‌హాల్‌ను ఆక్రమించుకుని వారి ఆధీనంలో ఉంచుకుని ఎటువంటి లెక్కా పత్రం లేకుండా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి సహకారంతో గ్రామానికి చెందిన యువకులు సదరు ఫంక్షన్ హాల్‌పై సమాచార హక్కు చట్టం కింద ప్రభుత్వానిదా? ప్రైవేటుదా తెలియజేయాలంటూ దరఖాస్తు చేయడంతో అసలు నిజాలు బయటకు వచ్చాయి.

ప్రభుత్వ స్వాస్థ్యం.. ప్రైవేటు వ్యక్తుల భోజ్యం

అప్పటి మంత్రి, ఇప్పటి ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు హయాంలో అసెంబ్లీ డెవలప్‌మెంట్ నిధుల కింద 25 సెంట్ల ప్రభుత్వస్థలంలో ఫంక్షన్‌హాల్ నిర్మించేందుకు ఇప్పటానికి 2008, ఏప్రిల్‌లో రూ.9 లక్షలు కేటాయించారు. అనంతరం అప్పటి శాసనసభ్యులు కాండ్రు కమల 2010 నవంబర్ 20వ తేదీన ప్రారంభించారు. ఆ తరువాత ప్రైవేటు వ్యక్తులు నిర్వహిస్తున్నారు. ఆ ఫంక్షన్ హాల్ ప్రభుత్వానికి చెందిందని అప్పటి ఎంపీడీఓ రామప్రసన్న నివేదిక అందజేశారు. మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్‌గా మారినతర్వాత తరువాత ఆ ఫంక్షన్‌హాల్‌ను రూ.కోటితో అభివృద్ధి చేస్తుంటే గతంలో ఫంక్షన్‌హాల్‌ను ఆక్రమించుకుని నిర్వహిస్తున్న వారు కోర్టుకు వెళ్లారు. కోర్టు సైతం మొట్టికాయలు వేసి ప్రభుత్వ ఆస్తిని మీకు ఎందుకు ఇవ్వాలంటూ తీర్పు వెలువరించింది. అనంతరం మళ్లీ అదే గ్రామానికి ఓ రాజకీయ పార్టీ నాయకుడు కోర్టులో ఫంక్షన్‌హాల్‌పై పిటీషన్ ఫైల్ చేయడం, ఇప్పటంలో రాజకీయ దుమారం లేపి జనసేన పార్టీ ఆధ్వర్యంలో స్థానికంగా ఉన్న 18 మంది ఇళ్లను ప్రభుత్వం ఎటువంటి సమాచారం ఇవ్వకుండా కూల్చుతోందని తప్పుడు సమాచారంతో కోర్టుకువెళ్లడంతో ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున అపరాధ రుసుమును హైకోర్టు విధించింది. ఫంక్షన్ హాల్ విషయమై కోర్టుకు వెళ్లిన వ్యక్తులు అప్పీల్‌ను నిలుపుదల చేయించుకున్నారు. అనంతరం కార్పొరేషన్ అధికారులు ఆ ఫంక్షన్ హాల్ అభివృద్ధిని ముమ్మరం చేశారు.

కుళ్లు రాజకీయాలకు తెరలేపిన నాయకులు...

పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఫంక్షన్‌హాల్‌ను తీర్చిదిద్ది నామమాత్రపు అద్దెను వసూలు చేసేందుకు మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి, కార్పొరేషన్ అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. అప్పుడే స్వార్థపరులైన కొంతమంది రాజకీయ నాయకులు ప్రభుత్వం, ఎమ్మెల్యే ఆర్కేపై సోషల్ మీడియాలో, తమకు అనుకూల పత్రికల్లో దుష్ప్రచారం నిర్వహించారు. కోర్టులో ప్రభుత్వం గెలిచినప్పటికీ వారి దుష్ప్రచారాలు మానలేదు. ఈ ఫంక్షన్‌హాల్‌పై జనసేన అధినేత పవన్‌కల్యాణ్, టీడీపీ నాయకుడు లోకేష్‌లు నానా రచ్చ చేసేందుకు ప్రయత్నించగా, అధికారులు, స్థానికులు వారి ప్రయత్నాలను తిప్పికొట్టారు. కులమతాలకు అతీతంగా ఈ ఫంక్షన్‌హాల్ నిర్మించామని, ఎవరైనా ఫంక్షన్లు నిర్వహించుకోవచ్చని సూచించారు. చివరకు కోర్టులు సైతం మొట్టికాయలు వేయడం, రెండవసారి కోర్టుకువెళ్లి వెనక్కి తిరిగి రావడంతో గొడవలు సద్దుమణిగి ఫంక్షన్ హాల్ నిర్మాణాన్ని అధికారులు పూర్తిచేశారు.

మహనీయుల పేర్లతో నామకరణం...

ఇప్పటంలో నిర్మించిన ఫంక్షన్‌హాల్‌కు ప్రధాన ద్వారం వద్ద దివంగతనేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేరు పెట్టగా, ఓపెన్ ఫంక్షన్‌హాల్‌కు ప్రజానేత వంగవీటి మోహనరంగా కళావేదిక అని నామకరణం చేశారు. వంటశాలకు వీరనారి చాకలి ఐలమ్మ, భోజనశాలకు సర్దార్ గౌతు లచ్చన పేర్లు పెట్టారు. ఈ మహనీయుల విగ్రహాలను సైతం ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేశారు. ఈనెల 28వ తేదీ జరగనున్న ప్రారంభోత్సవానికి ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి, రాజ్యసభ మాజీ సభ్యుడు మోదుగుల వేణుగోపాల రెడ్డి, ఎంటీఎంసీ స్పెషల్ ఆఫీసర్, జాయింట్ కలెక్టర్ రాజకుమారి, కమిషనర్ శారదాదేవి తదితరులు విచ్చేయనున్నారు.

'గండాలయ' మెట్లమార్గం అభివృద్ధికి కృషి



దాత సింహాద్రి వెంకట్రామిరెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆర్కే

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి

మంగళగిరి: పానకాల లక్ష్మీ నృసింహస్వామి దేవస్థాన కొండపై వేంచేసియున్న గండాలయ స్వామి మెట్ల మార్గం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) తెలిపారు. శుక్రవారం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ కొండపై వేంచేసియున్న గండాల స్వామిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చేందుకు సులువుగా ఉండేలా మెట్ల మార్గాన్ని అభివృద్ధి పర్చనున్నట్లు తెలిపారు. నగర పరిధి కాజకు చెందిన దాత సింహాద్రి వెంకట్రామిరెడ్డి సహకారంతో రూ. 4లక్షలతో మెట్ల మార్గాన్ని అభివృద్ధి చేయగా తాజాగా మరి కొన్ని పనులను చేపట్టేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. దాత సింహాద్రి వెంకట్రామిరెడ్డి, ఆలయ ఈఓ రామకోటిరెడ్డి పాల్గొన్నారు.

మూలాంకురేశ్వరి ఆలయ పూర్వవైభవానికి కృషి

ఆలయంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యేలు ఉండవల్లి శ్రీదేవి, గోపిరెడ్డి



కొబ్బరికాయలు కొట్టి శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యేలు డాక్టర్ శ్రీదేవి, గోపిరెడ్డి

ఫిరంగిపురం: మూలాంకురేశ్వరి ఆలయ పూర్వవైభవం తెచ్చేందుకు కృషిచేయనున్నట్లు నియోజకవర్గ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిలు అన్నారు. మండలంలోని అమీనాబాద్ గ్రామంలోని కొండపై కొలువై ఉన్న మూలాంకురేశ్వరి ఆలయంలో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ఆలయం ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ, ఆలయ గోపురానికి మరమ్మతులు, దేవస్థానం పైకప్పు నిర్మాణం, ఘాట్ రోడ్డు నిర్మాణపనులు, గర్భాలయ అంతరాలయం పనులు వంటి వాటికోసం ప్రభుత్వం నుంచి నిధులు సమకూర్చినట్లు తెలిపారు. ఆలయానికి పూర్వవైభవం తెచ్చేందుకు కృషిచేస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఆలయం వెనుకభాగంలో ఘాటు రోడ్డు నిర్మాణపనులకు కొబ్బరికాయలు కొట్టి శంకుస్థాపనలు చేశారు. ఆలయంలో మూలాంకురేశ్వరి అమ్మవారికి అర్చకుడు అయ్యన్నశాస్త్రి అష్టోత్తర, శతనామపూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో చిట్టా అంజిరెడ్డి, చిట్టా బాపూజీ రెడ్డి, షేక్ అబ్దుల్ గఫార్, గుమ్మడి చంద్రం, కె.ఆనంద్, డి.మెల్కియా, ఎంపీటీసీ సభ్యులు సకిలలక్ష్మీ, గాంధీ బుడే, ఎస్.చంద్రశేఖరరెడ్డి, డి.నరేంద్రకుమార్, చిన్నప్ప, పి.నాగలక్ష్మీ, ఆలయ అభి ఉత్సవ కమిటీ సభ్యులు, ఈఓ రామిరెడ్డి, కల్లి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి

తాడికొండ ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి



సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి

మేడికొండూరు: గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని తాడికొండ శాసనసభ్యురాలు డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. శుక్రవారం మేడికొండూరులో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరయిన ఎమ్మెల్యే శ్రీదేవి మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం పంచాయితీలకు నిధులు విడుదల చేస్తుందని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించి వాటిపరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు కృషిచేయాలని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు మెరుగైన సేవలు అందిచాలని తెలిపారు. ఎంపీపీ మన్నవ స్వప్న, ఎంపీడీఓ ఎం.శోభారాణి, వైస్ ఎంపీపీ భవనం రాజశేఖరరెడ్డి, తహసీల్దార్ జి.కరుణకుమార్, మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు, మండలంలోని అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతులు సహకార సంఘాలను ఉపయోగించుకోవాలి

మేడికొండూరు: మండల కేంద్రమైన మేడికొండూరులో రూ. 40 లక్షలతో నిర్మించిన పాట్లపాడు ప్రాథమిక వ్యవసాయ సహకారం పరపతి సంఘం నూతన భవనాన్ని శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే శ్రీదేవి మాట్లాడుతూ మేడికొండూరులో రూ. 40 లక్షలతో రైతులకు ఉపయోగపడే ఈ సహకార సంఘ భవనం నిర్మించడం అభినందనీయమన్నారు. గతంలో సహకార సంఘ భవనాలు శిథిలావస్థలకు చేరినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. నేడు మన ప్రభుత్వంలో సహకార సంఘాల నూతన భవనాలు నిర్మించడంతో పాటు, పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం సంతోషకరమైన విషయమన్నారు. రైతులు సహకార సంఘాన్ని ఉపయోగించుకోవాలన్నారు. మండల కన్వీనర్ తాళ్లూరు వంశీకృష్ణ, కిరణ్, చెన్నయ్య, ముత్యాల బాలస్వామి, శ్రీనివాసరావు, కిషోర్, నెలకుదిటి శ్రీహరి, జిలానీ, రసూల్ పాల్గొన్నారు.

అంతరపంటలతో తామర తగ్గుముఖం

ఫిరంగిపురం: మిరప పంటలో అంతరపంటలుగా ఉల్లి సాగు చేయడం ద్వారా తామర పురుగు తగ్గుముఖం పట్టినట్లు ప్రకృతి వ్యవసాయ ఎస్‌డీఏ అన్నామణి అన్నారు. మండలంలోని 113 తాళ్లూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా మిరపపంటను సాగుచేస్తున్న రైతు లక్ష్మారెడ్డి పొలంలో పంటను వ్యవసాయ శాఖ ఏఓ రమణకుమార్ శుక్రవారం పరిశీలించారు.

నిడుముక్కలలో...

నిడుముక్కల(తాడికొండ): ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పంటలకు, పర్యావరణ పరిరక్షణకు మేలు జరుగుతుందని తాడికొండ మండల వ్యవసాయాధికారి నరసింహారావు అన్నారు. తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలో బండ్ల రామ్మోహన్‌కు చెందిన జామ, మునగ పంటలకు జీవామృతం మరియు లాక్టిక్ యాసిడ్ బ్యాక్టీరియా తయారీపై పలువురికి వివరించారు. వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏఓ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో జీవామృతం వాడటం ద్వారా మొక్కలకు అనేక రకాల పోషకాలను అందించవచ్చన్నారు. వ్యవసాయ క్షేత్రం రైతు రామ్మోహనరావు మాట్లాడుతూ తాను గత మూడేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నానని, దిగుబడి ఆశాజనకంగా ఉండటంతో పాటు మంచి లాభాలు ఆర్జిస్తున్నానని తెలిపారు.

గణపతి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం

మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరులో వేంచేసియున్న బాల గణపతి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం శుక్రవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. మాజీ వైస్ ఎంపీపీ మొసలి పకీరయ్య, ఆలయ కమిటీ సభ్యులు జి.కృష్ణారావు, బిట్రా రాఘవయ్య, ఆనందం వెంకట్రావు, పంతంగి శివ, గడ్డం అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాహనచోదకులు నిబంధనలు పాటించాలి

మంగళగిరి: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పట్టణ సీఐ బి.అంకమ్మరావు అన్నారు. నగరంలోని గౌతమ బుద్ధా రోడ్డులో శుక్రవారం ఆయన ఎస్‌ఐలు నారాయణ, మహేంద్రలతో కలసి ద్విచక్ర వాహనచోదకులకు అవగాహన కల్పించారు. వాహనచోదకులు తప్పని సరిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. లైసెన్సులు లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కేఎల్‌యూలో అంతర్జాతీయ కెమిస్ట్రీ సదస్సు

తాడేపల్లిరూరల్: గ్రీన్ హౌస్ వాయువుల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా పరిశోధనలు జరగాలని ఏపీ నూతన పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీలో నిర్వహించిన మూడవ అంతర్జాతీయ కెమిస్ట్రీ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ కిషోర్ బాబు మాట్లాడారు. అనంతరం డాక్టర్ శ్రీనివాస్‌ను ప్రొ చాన్స్‌లర్ జగన్నాధరావు ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రొ వీసీ డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఈఓపీఆర్డీ సత్యకుమార్‌కు సత్కారం

తాడికొండ: అంకిత భావమే విధులకు తగగిన గుర్తింపు తెచ్చిపెడుతుందని పలువురు కార్యదర్శులు, మండల పరిషత్ ఉద్యోగులు అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయి ఉత్తమ ప్రతిభా పురస్కారం అందుకున్న ఈఓపీఆర్డీ సత్యకుమార్‌ను పలువురు పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ మాట్లాడుతూ పురస్కారం తనలో మరింత బాధ్యతను పెంచిందని, క్షేత్రస్థాయి సిబ్బంది, అధికారుల సహకారంతో తనకు లభించిన ఈ గుర్తింపును దృష్టిలో ఉంచుకొని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు.

రేపు మెగా వైద్య శిబిరం

మంగళగిరి: నగరంలోని కొప్పురావు కాలనీ శ్రీగురు దత్త ఆశ్రమంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మానవ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగర సురేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో పలువురు వైద్యులు బీపీ, షుగరు పరీక్షలతో పాటు కీళ్ల, ఎముకలు, నేత్ర, దంత వైద్య పరీక్షలను నిర్వహిస్తారని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సాగర్ బ్రాంచ్ కెనాల్‌లో గుర్తుతెలియని మృతదేహం

మేడికొండూరు: డొకిపర్రు నాగార్జునసాగర్ కెనాల్ బ్రాంచ్‌లో శుక్రువారం గుర్తు తెలియన మృతదేహం లభ్యమయింది. మేడికొండూరు ఎస్ఐ కోటేశ్వరరావు కెనాల్‌వద్దకు వచ్చి మృతదేహన్ని రుద్ర ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులచే బయటకు తీయించారు. మృతుడి వయస్సు సుమారు 35 సంవత్సరాలు ఉండవచ్చని పోలీసులు తెలిపారు. ఒంటిమీద నల్ల టీషర్ట్, ఫుల్ డ్రాయర్‌తో ఉన్నాడు. కాళ్లపై రక్తపుగాయాలు ఉండటంతో ఎవరైనా హత్యచేసి పడేసింటారని పోలీసులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. మృతదేహం సమాచారం తెలిసినవారు మేడికొండూరు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు. మృతదేహన్ని గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

మేడికొండూరు: రోడ్డుపై వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుకగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మేడికొండూరు ఇందిరా కాలనీ చర్చివద్ద శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గుంటూరు ఎన్టీఆర్ నగర్‌కు చెందిన వి.అంజి ద్విచక్రవాహనంపై సత్తెనపల్లి వైపు వెళ్తున్నాడు. మార్గమధ్యలో ఎదురుగా వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొట్టాడు. ఈ సంఘటనలో ప్రయాణిస్తున్న అంజికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడ్ని గుంటూరు ప్రభుత్వాసుపత్రికి 108లో తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉత్సాహభరితంగా క్రీడా పోటీలు

మంగళగిరి: నగర పరిధిలోని యర్రబాలెం డాన్‌బాస్కో ఉన్నత పాఠశాల ఆవరణలో పాఠశాల వ్యవస్థాపకులు జాన్‌బాస్కో వర్ధంతి సందర్భంగా రెండు రోజుల పాటు నిర్వహించతలపెట్టిన కబడ్డీ, ఖోఖో క్రీడాపోటీలు శుక్రవారం ఉత్సాహ భరిత వాతావరణంలో ఉల్లాసంగా ప్రారంభమయ్యాయి. పోటీలను పారిశ్రామికవేత్త నన్నపనేని నాగేశ్వరరావు, మహిళా సంఘం అధ్యక్షురాలు వల్లభనేని వాణిలు ప్రారంభించారు. మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని 14 ఉన్నత పాఠశాలల నుంచి 34 టీమ్‌లకు చెందిన బాలబాలికలు వేర్వేరుగా కబడ్డీ, ఖోఖో పోటీల్లో పోటీల్లో తలపడ్డారు. ఫాదర్ చిన్నప్ప, ఫాదర్ జోస్, ఫాదర్ మర్రెడ్డిలతో పాటు వివిధ పాఠశాలలకు చెందిన పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొని క్రీడలను పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడేపల్లి రూరల్: నేడు తాడేపల్లి పట్టణ, రూరల్ ప్రాంత పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ అక్కుల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 132టు33 కేవీ విద్యుత్ ఉప కేంద్రం, తాడేపల్లిలో మరమ్మతుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నూతక్కి, చిర్రావూరు, వడ్డేశ్వరం, గుండిమెడ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ప్రకటనలో తెలిపారు.





